
బాల్ బ్యాడ్మింటన్ జట్టు కోసం సెలక్షన్స్ ప్రారంభంలో నిర్వాహకులు

బాల్ బ్యాడ్మింటన్ జట్టు కోసం సెలక్షన్స్ ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో బాల్ బ్యాడ్మింటన్ జట్టు కోసం సెలక్షన్స్ శనివారం కేపీహెచ్‌బీలో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు స్టేట్ ఛైర్మన్ శ్రీనివాసరావు, అధ్యక్షుడు రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్ ప్రారంభించారు. నెల 25వతేదీ నుంచి హరియానాలో జరిగే జాతీయ 43వ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం నుంచి బాల, బాలికల జట్టును ఎంపిక చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉమ్మడి 10 జిల్లాల నుంచి ఆడించి జట్లు ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ స్పోర్ట్స్ క్లబ్ అడ్వైజర్ జేఎస్ నారాయణరావు, అధ్యక్షులు విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి మోర్ల రామకృష్ణ, కోచ్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి

ఖేల్‌కాలనీ, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమ అభివృద్ధికి అసోసియేషన్లు, కార్మిక సంఘాలు కలిసికట్టుగా కృషి చేయాలని సంస్థ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రెహ్మాన్ సూచించారు. ఇటీవల జరిగిన ఎస్సీ ఎంప్లాయీస్ ఎన్నికల్లో గెలుపొందిన నూతన కార్యవర్గ సభ్యులతో సమావేశమై చర్చించారు. అసోసియేషన్ సభ్యులు సంస్థ అభివృద్ధిలో ప్రత్యేక చొరవ చూపిస్తూ, నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. భెల్ ఎస్సీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సురేందర్ మాట్లాడుతూ.. కార్మిక సంక్షేమం, కర్మాగార అభివృద్ధే అసోసియేషన్ ప్రధాన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవాఅర్జున్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికుమార్, ఉపాధ్యక్షుడు కొడాలి సురేష్, కోశాధికారి నరసింహులు, సంయుక్త కార్యదర్శి స్వామిదాస్, యూనియన్ నాయకులు స్వామి, కొండారెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శోభాయాత్రకు రథాలు సిద్ధం

బాలానగర్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): చవితి వేడుకల్లో భాగంగా చివరి ఘట్టమైన గణేశ్ శోభాయాత్రకు రథాలు సిద్ధమయ్యాయి. కారు, డీసీఎంలతో రథం ఆకృతిలో రంగురంగుల విద్యుత్ దీపాలు, ఆకట్టుకునే అలంకరణతో నిర్వాహకులు రూపొందించారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, మూసాపేట, బాలానగర్ తదితర ప్రాంతాల రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన ఈ రథాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. భారీ విగ్రహాలు కాకుండా సుమారు 3 అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాలను ఈ రథాల్లో నిమజ్జనానికి తరలించేందుకు మండప నిర్వాహకులు సుముఖత చూపుతుండడంతో రథాల నిర్వాహకులు సంతోషంగా ఉన్నారు. ఒక్కో రథానికి 7 వేల రూపాయలు చార్జి చేస్తున్నారు.

'కౌశిక్‌రెడ్డి ఆంధ్ర సమస్యను లేవనెత్తడం సబబు కాదు'

నిజాంపేట్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల మధ్య జరిగిన వ్యక్తిగత ఘర్షణలో ఆంధ్ర సమస్యను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి లేవనెత్తడంసమంజసం కాదని నిజాంపేట్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణను ఆంధ్ర ప్రాంతం వారిని ఇందులోకి తీసుకురావడంపై బాచుపల్లిలో కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో ఉన్న ఆంధ్ర ప్రాంతవాసులు రాజకీయంగా బీఆర్‌ఎస్‌కు అండగా నిలిచిన రోజులను కౌశిక్‌రెడ్డి మరిచిపోయినట్టు ఉన్నారని విమర్శించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని గోదారిహోమ్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లోక కల్యాణార్థం వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి వివిధ కాలనీవాసులు హాజరై మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాధవరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కిడ్నాప్, దోపిడీ, అత్యాచారం, హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు


కుర్వాస్వామి


నర్సమ్మ

దుండిగల్: మహిళా అడ్డా కూలీని కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి ఆమె వద్ద ఉన్న బంగారు నగలు దోచుకుని హత్య చేసిన ఇద్దరు వ్యక్తులకు రంగారెడ్డి ఎల్‌బీనగర్ కోర్టు జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు జీవిత ఖైదు విధించారని మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2021 జూలై 25న మల్లంపేట్ అడ్డా నుంచి నాగరకర్నూల్, యాప్తాల మండలం, చంద్రబండ తండాకు చెందిన మహిళ (35) కిడ్నాప్‌నకు గురైంది. దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. సీసీకెమెరాల ఆధారంగా ఐడీఏ బొల్లారానికి చెందిన కుర్వ కుమారస్వామి(30), మానసమోళ్ల నర్సమ్మ(30) సదరు మహిళను కిడ్నాప్ చేశారు. ఆమెను జిన్నారం ప్రాంతంలోని నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం తాగించారు. ఆమెను కుర్వస్వామి అత్యాచారం చేశాడు. అనంతరం నర్సమ్మ సాయంతో ఆమెను హత్య చేశాడు. దుండిగల్ పోలీసులు ఆధారాలు చూపడంతో ఈనెల 13న కోర్టు నిందితులకు యావజ్జీవ కారాగారా శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

అడుగడుగున గుంతలు

● నత్తనడకన సాగుతున్న ఫ్లై ఓవర్ పనులు ● వాహనదారులకు తిప్పలు


దీప్తిశ్రీనగర్ రేగులకుంట ప్రధాన రోడ్డులో గుంతలు

మియాపూర్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. దాదాపు పది లక్షలకు పైగా జనాభా ఉంటున్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో భారీ వర్షాలు సృష్టించిన బీభత్సంతో దాదాపుగా 60 శాతానికి పైగా అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. మరోపక్క కొత్తరోడ్ల నిర్మాణం పేరుతో తవ్వి వదిలేసిన రోడ్లు, ఫ్లై ఓవర్ పనుల జాప్యంతో ఎక్కడిక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో రోడ్లపైకి రావాలంటేనే వాహనదారులు భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధానంగా బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలో, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, చందానగర్, పటాన్‌చెరు వెళ్లే ప్రధాన రహదారులు కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. బురదమయంగా మారి తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇక్కడ కనీసం మరమ్మతులు కూడా చెప్పట్టకపోవడంతో ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులు జాప్యం జరగడంతో రోడ్లు ప్రమాదభరితంగా మారింది. దీనికి తోడు చందానగర్‌లో సర్వీస్‌రోడ్లు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో మోకాళ్లలోతు ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఇదే ప్రాంతంలో హుడా కాలనీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరోవైపు హఫీజ్‌పేట మంజీర పైపులైను రోడ్డు గుంతలు తవి మట్టికుప్పలు రోడ్డు మధ్యలో పోయడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. హెచ్ఎంటీ స్వర్ణపురికాలనీ ప్రధాన రహదారి, ప్రశాంత్‌నగర్, ఎంఏనగర్, కృషినగర్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డు, దీప్తిశ్రీనగర్, పీజేఆర్‌నగర్ చందానగర్ లింకురోడ్డు, ఆర్టీసీ కాలనీ, హఫీజ్‌పేట అంతర్గత రహదారులు, గోకుల్‌ప్లాట్స్‌లోని పలు రహదారులు, మంజీర పైపులైను నుంచి హైటెక్స్‌కు వెళ్లే రహదారి, ఖాజాగూడ, గచ్చిబౌలి ప్రాంతాల్లో అంతర్గత రహదారులు గుంతల మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బ తిన్న రోడ్లకు, గుంతలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని వాహనదారులతో కాలనీవాసులు కోరుతున్నారు.


బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత


సీబీసీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

రోడ్డుపై మురుగునీటి ప్రవాహం

బాలానగర్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): బాలానగర్ కో ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ పోస్టాఫీస్ రోడ్డులో ము రుగునీరు రోడ్డుపై చేరుతోంది. వర్షం లేకుండానే నీరంతా రోడ్లపై పారుతుండడంతో ప్ర యాణాలు సాగిస్తున్న వాహన దారులు, పాదాచారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు లీకై రోడ్లపై పారుతోందని ఎవరైన ఫిర్యాదు చేసిన జీహెచ్ఎంసీ సిబ్బంది తూతూ మంత్రంగా పనులు చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. మురుగునీటి మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేసినా మరుసటి రోజు నుంచే పరిస్థితి యథాతథంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.


లడ్డూలు చూపిస్తున్న వంశీమోహన్, మౌనీష్‌రెడ్డి

గణేశ్ లడ్డూ @ 8,73,000

నిజాంపేట్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ ప్రధాన రహదారి ఏడీఆర్ మకుట ఫైస్పేస్ అపార్టుమెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేశ్ లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో చిన్న లడ్డూ, పెద్ద లడ్డూలను ఇద్దరు వ్యక్తులు వారు లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. పెద్ద లడ్డూను వంశీమోహన్, మౌనీష్‌రెడ్డి అనే వ్యక్తులు రూ.8.73 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. అదే విధంగా చిన్న లడ్డూను ఫైస్పే స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి రూ.3.50, వేలకు వేలం పాటలో కొనుగోలు చేశారు. రూ. 50 వేలు విలువ చేసే కాసుల దండను అసోసియేషన్ మహిల కొనుగోలు చేసింది.

ఘనంగా గణనాథుని నిమజ్జనాలు

ఖేల్‌కాలనీ, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా పలు మండపాల్లో లంబోదరుడి చేతిలో ఉండే లడ్డూ వేలం జోరుగా జరుగున్నారు. భెల్ ఎంఐజీ కాలనీ, ఎల్ఐజీ, హెచ్ఐజీ, టౌన్‌షిప్ శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అన్న సంతర్పణలు, లడ్డూవేలం నిర్వహించారు. అమీన్‌పూర్ వీరారెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో స్వామి వారికి 108 రకాల మిఠాయిలు, వంటకాలను నైవేద్యంగా పెట్టి పూజలు చేశారు. దాదాపుగా ప్రతీ మండపంలో జరిగిన వేలంలో యాభై వేల నుండి లక్ష రూపాయల వరకు లడ్డూపాట జరిగింది. ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణలు నిర్వహించారు.

హెచ్‌సీయూ విద్యార్థుల కులగణన పోరాటానికి రిటైర్డ్ డీజీపీ మద్దతు


దీక్షకు మద్దతు తెలుపుతున్న రిటైర్డ్ డీజీపీ పూర్ణచందర్‌రావు

రాయదుర్గం, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కులగణన పోరాటం అసెంబ్లీ, పార్లమెంట్‌ను తాకాలని, బీసీలకు రాజ్యాధికారం కులగణనతోనే సాధ్యమని రిటైర్డ్ డీజీపీ, బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు అన్నారు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో కులగణన అమలుపై సత్యాగ్రహం చేస్తున్న విద్యార్థులకు పూర్ణచందర్‌రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కులగణన ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని వర్సిటీ విద్యార్థులు చేస్తున్న సత్యాగ్రహ దీక్ష స్ఫూర్తిదాయకమన్నారు. ఇతర విద్యాసంస్థల్లోని విద్యార్థి సంఘాలు వీరి ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలన్నారు. కులగణనకు చేసే ప్రతి పోరుకు బీఎస్పీ మద్దతు కచ్చితంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ బీసీ నేతలను, ఉద్యమకారులను, కుల సంఘాలను ఈ దిశగా ఉత్తేజపరచటానికి రౌండ్‌టేబుల్ సమావేశాలు, బీసీ అసెంబ్లీలు నిర్వహిస్తుందని, ఇది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సాగుతుందన్నారు. రానున్న రోజుల్లో మహోద్యమంగా మారనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

బండారి లే-అవుట్‌లో చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు

నిజాంపేట్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బండారి లే-అవుట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఓ పెయింటిగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో చాలా మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొని విజయం సాధించిన వారికి పెయింటిగ్ ఇనిస్టిట్యూట్ వారు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి 27వ వార్డు కార్పొరేటర్ జ్యోతిరెడ్డి, బండారి లే-అవుట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొని, ప్రతిభ కనబరిచిన పిల్లలను అభినందించారు.


పెయింటిగ్ వేస్తున్న చిన్నారులు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకై గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ శనివారం మృతి చెందింది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం దూలపల్లి గ్రామంలోని అయ్యప్ప కాలనీ రోడ్డు నెంబరు-2లో నివాసం ఉంటున్న హిందూ(40) ఈ నెల 10న రాత్రి వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలు కాగా, తీవ్ర గాయాలైన హిందూ అప్పటి నుంచి చికిత్స పొందుతుంది. అయితే ఆమె పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది.

మరో మహిళ

గాజులరామారం: సూరారం ప్రాంతానికి చెందిన మహిళ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. సూరారం కాలనీకి చెందిన బేబీబేగం(40) కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధ పడుతూ గాంధీ ఆస్పత్రి ఆవరణలో తిరుగుతుండగా గమణించిన సెక్యూరిటీ గార్డ్ ఆమెను ఎక్కడి నుంచి వచ్చావు అని అడిగి, గత నెల 18న చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న మహిళ శనివారం మృతి చెందింది. గాంధీ ఆస్పత్రి వారు సూరారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేసుకొన్నారు.

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎన్‌రెడ్డి నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్‌లోని ఎంఎన్‌రెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్లో ఆర్‌బీఎల్ బ్యాంక్ సహాయంతో కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో రక్త పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి , అవసరమైన వారికి మందులకు అందజేశారు.

వీసీ కోసం ఎదురుచూపులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 14ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలని వర్సిటీ అధికారులు, అటానమస్ కాలేజీ విద్యార్థులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. గత మే 22 నుంచి ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారినే కొనసాగిస్తుండడంతో వర్సిటీలో పాలన మందగించింది. యూనివర్సిటీలోని వివిధ విభాగాలకు సంబంధించిన ఫైళ్లతో పాటు వేలాది మంది విద్యార్థుల ఫలితాలకు సంబంధించిన ఫైళ్లపెండింగ్‌లో పడ్డాయి. జూన్‌లో పరీక్షలు జరిగి, జూలైలో మూల్యాంకనం అయిపోయినప్పటికీ తమ పిల్లల ఫలితాలను జేఎన్‌టీయూ ప్రకటించకపోవడంపై అటానమస్ కాలేజీల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను అడిగితే జేఎన్‌టీయూ అధికారుల అప్రూవల్ కోసం పంపామని చెబుతున్నారని, వర్సిటీ అధికారులేమో ఫలితాలు ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో తెలియడం లేదు..

● ఫలితాల కోసం ఎదురుచూపులు

జేఎన్‌టీయూ పరిధిలో 175 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా, 95 అఫిలియేటెడ్ కళాశాలలు, మరో 80 వరకు అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. అఫిలియేటెడ్ కాలేజీల్లో పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల ప్రకటన.. నేరుగా వర్సిటీ పరీక్షల విభాగమే చూసుకుంటోంది. అటానమస్ విద్యార్థులకు సంబంధించి ఆయా కళాశాలల సిబ్బందే పరీక్షలు నిర్వహించి, మూల్యాంకనం పూర్తిచేస్తారు. ఫలితాలు వర్సిటీ ఉన్నతాధికారుల ఆమోదం మేరకే ప్రకటిస్తారు.

ఆ బాధ్యతలను వేరొకరికి అప్పగించాలి

వర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఐఏఎస్ అధికారి.. వర్సిటీ పాలనకు తగినంత సమయం కేటాయించ లేకపోతున్నారని, అలాంటపుడు యూనివర్సిటీలోనే మరొక సీనియర్ అధికారికి ఆ బాధ్యతలు అప్పగిస్తే బాగుండేదని విద్యార్థి సంఘాల ప్రతినిధులు సూచిస్తున్నారు.

ముగిసిన కూన వెంకటేష్‌గౌడ్ అంత్యక్రియలు


వెంకటేష్‌గౌడ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న టీటీడీపీ రాష్ట్ర నాయకులు కూన వెంకటేష్‌గౌడ్ శుక్రవారం రాత్రి కన్నుమూశారు. శనివారం పార్థివ దేహాన్ని బేగంపేటలోని బ్రాహ్మణవాడి నుంచి వారి స్వగ్రామం గాజులరామారానికి తీసుకువెళ్లారు. ఆయన పార్థివ దేహాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, కేపీ వివేకనంద్‌గౌడ్, కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చా ర్జి డాక్టర్ కోట నీలిమతో పాటు నాయకులు విశాల్ సుధాం, బీఆర్‌ఎస్ నేత టి.శ్రీహరి, నరేందర్‌రావుతో పాటు వందలాది మంది అభిమానులు సందర్శించి నివాళులర్పించారు. గాజులరామారంలోని శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలను పెద్ద కుమారుడు కూన శ్రవణ్‌కుమార్‌గౌడ్ నిర్వహించారు.

కూన వెంకటేష్‌గౌడ్‌కు నివాళి

ఓల్డుబోయినపల్లి: సీనియర్ నాయకుడు కూన వెంకటేశ్‌గౌడ్ మృతిపట్ల ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మయాదవ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శనివారం జీడిమెట్ల గాజులరామారంలో వెంకటేశ్ గౌడ్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంతిమయాత్రలో ఎమ్మెల్యే

హైదర్‌నగర్: టీడీపీ నాయకుడు కూన వెంకటేష్‌గౌడ్ అంతిమయాత్రలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. కూన వెంకటేష్‌గౌడ్‌తో కలిసి టీడీపీలో పనిచేసిన రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. కూన వెంకటేష్‌గౌడ్ మంచి మనసున్న మనిషి అని కొయాడారు.

కాయగూరలతో గణేశుడికి అలంకరణ


గణేశ్ ఉత్సవాల్లో భాగంగా స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీలోని రత్నవెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వినాయకుడిని కాయగూరలతో అలంకరించారు. ఈ వినాయకుడుని రోజు కొక రూపంలో భక్తుల కోసం తీర్చిదిద్దుతారు.


నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలోని గణేశ్ మండపంలో కుంకుమార్చనలో మహిళలు


అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లోని వీ-టీమ్ గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపంలో అల్లాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జి.రవీందర్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్‌ను శనివారం సన్మానించారు.

నిమజ్జన మార్గాల్లో ఇతర వాహనాలకు అనుమతి లేదు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనాలు చేసే చెరువులు, బేబీ పాండ్ మార్గాల్లో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు వాహనాలకు అనుమతి లేదని ట్రాఫిక్ పోలీసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఐడీఎల్ ట్యాంక్ (రంగదాముని చెరువు), ప్రగతినగర్ అంబీర్‌చెరువు మార్గాల్లో ప్రత్యామ్నాయమార్గాల్లో వాహనాల రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. ఐడీఎల్ ట్యాంక్ వద్ద జాతీయ రహదారి నుంచి రెయిన్‌బో విస్టా వెళ్లే మెయిన్ రోడ్డు వరకు మూసేస్తామని, ఖైత్లాపూర్ నుంచి వచ్చే వాహనాలు మూసాపేట్ అంజనేయనగర్ చౌరస్తా మీదుగా, అశోకా వన్ మాల్ నుంచి వచ్చేవాహనాలు నేరుగా జాతీయ రహదారి మీదుగా కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అలాగే ప్రగతినగర్ చెరువు వద్ద జేఎన్‌టీయూ నుంచి వచ్చే వాహనాలు తులసీనగర్ కోనసీమ హోటల్ నుంచి కొలను రాఘవరెడ్డి గార్డెన్స్ నుంచి నిజాంపేట్ నుంచి రాకపోకలు, అలాగే గండిమైసమ్మ, ప్రగతినగర్ నుంచి వచ్చే వాహనాలు నిజాంపేట్ మీదుగా జేఎన్‌టీయూ వైపు రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. గణేశ్ నిమజ్జనాలకు వచ్చే వినాయకుడి విగ్రహాల వెంట వ్యక్తిగత వాహనాలను మాత్రం క్రేన్‌ల వద్దకు అనుమతి లేదని వాటి కోసం కేటాయించిన ప్రదేశాల్లో నిలపాలని తెలిపారు. వ్యక్తిగత వాహనాలపై వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు వచ్చే భక్తులు కూడా ఇతరులకు అసౌకర్యం కలిగించకుండా నిమజ్జనం సజావుగా, ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

